# దేవుడిగది

"అట్లాగా అమ్మా....అయితే నీకు పూజచేసుకునే అలవాటు లేదన్నమాట" అన్నది పొరుగింటి సీతమ్మ....

"లేదు పిన్నీ" అన్నది సుశీల. సుశీల కొత్తగా కాపురానికి వొచ్చింది. ఆమెను పరామర్శించడానికి వచ్చింది పొరుగింటి సీతమ్మ. వొచ్చి మాటల్లోకి దింపింది.

"పోనీలే అమ్మా....లేకపోతే లేకపోయింది. మనస్సులో వుండాలి గాని, పూజలనీ, పునస్కారాలనీ, ఈ పై బండారాలు లేకపోతే మట్టుకేం" అన్నది సీతమ్మ. అని అంతటితో ఊరుకుందా! ఊరుకోలేదు సుశీలకు భర్త అయిన క్రాంతినాధుని మొదటి భార్యకు పూజలంటే యిష్టమనీ, రోజులో ఎక్కువభాగం దేవుడిగదిలోనే గడిపేదనీ చెప్పింది. అది క్రాంతి నాధునికి అట్టే యిష్టంగా ఉండేదికాదనికూడా చెప్పింది. అయినా అతడు ఏమీ అనేవాడుకాదట. ఆమె యిష్టం ఒచ్చినట్లే జరగనిచ్చే వాడట— "పాపం అతి మంచివాడు. ఎవ్వరికీ కష్టం కలగడం అతనికి యిష్టం వుండదు" అని ముగించింది.

సుశీల యేమీ మాట్లాడలేదు. ఇందులో మాట్లాడవలసింది మాత్రం ఏముంది? తనభర్త మంచితనం ఆమెకు మొదటిరోజే తెలిసింది. మరొకరు చెప్పవలసిన అవసరంలేదు. తన భర్త మొదటిభార్య సంగతి తనకు అట్టే తెలియకపోయినా, ఆమెను గురించికూడా తనకెవ్వరూ చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఆమెనుగురించి మంచైనా చెడైనా, తనకు వినాలనిలేదు. అయినా పొరిగింటి సీతమ్మ ఆమెను విడిచిపెట్టలేదు.

"నిజం సుశీలా! ఆమె మరణించింతర్వాత, అతను మళ్ళీ పెళ్ళి

చేసుకుంటున్నాడని తెలియగానే, మా అందరికీ ఆశ్చర్యం వేసింది. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడని మేమెవ్వరం అనుకోలేదు" అన్నది.

దీనికి సుశీల యేం చెప్పతుంది? మెదలకుండా వింటూ కూర్చుంది. "పోనీలే, అమ్మా జరిగిందేదో జరిగింది. నీతో బాగుంటున్నారా?" అని అడిగింది సీతమ్మ.

ఇక సుశీలకు జవాబు చెప్పక తప్పలేదు. "అదేమిటి పిన్నీ, బాగుండకపోవడం ఏమిటి?" అన్నది.

"అదికాదే, మొదటిరోజుల్లో ఎప్పుడూ దేవుడిగదిలోనే కూర్చునే , అడుగుతున్నా" అన్నది సీతమ్మ.

అప్పటినుంచి సుశీలకు తన అత్తవారి యింట్లోవున్న దేవుడి గది మీదకు దృష్టి మళ్ళింది. తాను వచ్చినప్పటినుంచి ఆ గది తాళం వేసే వుంటూంది. దాని జోలి ఎవ్వరికీ పట్టినట్టే కనపడదు తన భర్తగాని అత్తగారుగాని ఆ గది చాయలకే వెళ్ళినట్లు కనపడదు.

ఆమెకు ఒకరోజు ఆ గది తాళపు చెవి ఎక్కడుందో తెలుసుకోవాలనిపించింది. ఆ గది తాళపుచెవి ఎక్కడుంది? ఇన్నాళ్ళూ ఆమె ఆ గదిని చూస్తూంది వేసివున్న తాళాన్ని చూస్తూవుంది. కాని తాళపుచెవి ఎక్కడుంది? అనే ప్రశ్న ఇవ్వాళే తట్టింది, ఎందుకనో! ఒకరోజు భర్తని అడుగుదాం అనుకున్నది.

"మీ సిల్కుచొక్కా వొకటి ఉండాలి మాదంకి" అన్నది.

"అవును" అన్నాడు భర్త....

"చాకలివాడు తీసుకురాలేదు" అన్నది.

"కబురు పంపించు. తెస్తాడు" అన్నాడు భర్త.

చాకలివాడు సిల్కుచొక్కా తేకపోవడానికీ దేవుడిగది తాళపుచెవికీ, సంబంధం ఏమిటో ఆమెకు అర్థంకాలేదు. కాని మాట్లాడుతూనే వుంది.

"ఏమో, ఏమితెస్తాడో" అన్నది.

"తెస్తాడు, వాడు చాలా నమ్మకమైనవాడు" అన్నాడు భర్త.

"మీకంతా నమ్మకమయిన వాళ్ళే" అన్నది. అన్నది కాని అన్నందుకు వెంటనే పశ్చాత్తాపపడింది. తాళపుచెవి అడుగుదామని బయలుదేరి నిందమోపటందాకా వెళ్ళింది తను. తన భర్త మంచివాడు గనక సరిపోయింది. లేకపోతే తగాదాలోకి దిగేది. ఇక లాభంలేదని అనుకొని అత్తగారి నడిగింది.

"నా ట్రంకుపెట్టె తాళంచెవి పోయిందండీ...."

"అయ్యో ఎట్లా పోయిందే" అన్నది అత్తగారు.

"ఎక్కడో పెట్టి మరచిపోయ్యాను."

"వెతుకమ్మా. వెతుకు."

"వెతికాను. కనపడలేదు."

"పోనీ బజారుకు పంపి కొత్త తాళపుచెవి తెప్పించకపోయావా అమ్మా?"

"ఎవ్వరున్నారు, తేవటానికి!"

"అబ్బాయితో చెప్పకపోయావ్!"

అంతే, అత్తగారిని కూడా అడగలేకపోయింది, దేవుడు గది తాళపుచెవి అడగటానికి తనకెందుకు కుదరటం లేదో ఆమెకు అర్థం కాలేదు. అప్పటికి మెదలకుండ పూరుకుంది. మనస్సులోమాత్రం దేవుడిగని మెదలటం మానలేదు.

* * *

ఒకరోజు రాత్రి, నిద్రపోతున్న సుశీలకు, పూజ చేసుకునే గది దగ్గర అలికిడైనట్లు అనిపించి మెలకువ వొచ్చింది. కళ్ళు తెరిచి చూచింది. భర్త మంచంమీద లేడు. నెమ్మదిగా లేచి పూజచేసుకునే గదిదగ్గరకు

వెళ్ళింది. పూజ చేసుకునే గది గదిగానే వుంది. వేసి వున్న తాళం తాళం గానే వుంది. ఇంతలో పక్క గదిలోంచి ఆమె భర్త వొచ్చాడు. అటూ ఇటూ చూచి తాళంతీసి, తలుపు తెరిచాడు. గదిలోకి వెళ్ళాడు. ఆమె గుండె గుభేలుమన్నది. ఇంతకుముందు ఆమెకు దేవుడు గది ఎపుడూ వొకే విధంగా కనిపించింది. దేవుడిగది అనుకోగానే మూసివుంచిన తలుపులూ, వేసి వుంచిన తాళం ఆమెకు ప్రత్యక్షం అయ్యేవి. అటువంటి దేవుడిగది ఇప్పుడు దేవుడి గదిగా కనపట్టం లేదు. తలుపులు తెరుచుకొని ఉన్నయ్ తాళం, జారిన జబ్బకుమల్లే కొక్కానికి వేళ్ళాడుతూ వుంది. ఆమెకు ఒక్కసారిగా విచారం వేసింది. విచారం వెయ్యా టమేతడవుగా కాళ్ళు వొణికినై. ఆమె అట్లా ఎంతసేపు నిలబ డిందో, దేవుడి గదిలోనుంచి భర్త బయటకు రావటం చూచింది. నెమ్మదిగా తలుపులు మూశాడు. తాళం వేశాడు. సొమ్మసిలి తలుపుకే ఆనుకొని నుంచున్నాడు. మనిషిలో ఎంతమార్పు ఇంతసేపూ దేవుడిగదిలో ఏం చేస్తున్నాడో!

అతను గదిదగ్గరనుంచి కదిలాడు? ఆమె ముందుగావెళ్ళి ఏమీ దెరగనట్టు పడుకుంది పక్కగదిలో డ్రాయరు లాగినమోత. ఆమె తన భర్త ఎవుడిగది తాళపు చెవిని డాయర్లో పెడుతున్నాడని గ్రహించింది. అతను డ్రాయరు మూశాడు? గదిలోకి వొచ్చాడు. అతని పక్కమీద పడుకున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. అతని కళ్ళ వెంట నీరు కారటం ఆమె చూసింది.

ఆ రాత్రి ఇక ఆమెకు నిద్రపట్టలేదు. తలుపులు తెరచిన, తాళం తీసిన దేవుడిగదీ, తాళం తీస్తున్న తన భర్తా, తన భర్త కార్చిన కన్నీరూ– ఎంతసేపూ ఇవే జ్ఞాపకం వచ్చేవి. ఎప్పుడూ తాళం వేసివుండే దేవుడిగదిని తన భర్త యెందుకు తెరిచాడు? ఆ గదిలో ఏం చేశాడు? ఇంతకీ ఆ గదిలో ఏముంది? యింత రహస్యం దేనికోసం?

ఆమె మనస్సు వికలం అయింది. వికలమయిన మనస్సుతో తెల్ల వారి లేచింది. భర్త మామూలుగానే ప్రతి చిన్న విషయంలోనూ ఆమెను సంతోషపెట్టటానికి ప్రయత్నించాడు. కాని ఈనాడు అతని ప్రయత్నంలో

అసహజత్వం కనిపించింది సుశీలకు. అతను తనపట్ల భర్తగా తన విధ్యుక్తధర్మాన్ని మాత్రమే నెరవేర్చుకుంటున్నాడని, మనస్సు వుంచి ఏ పనీ చెయ్యటంలేదనీ అనిపించింది ఆమెకు.

"మీ మనస్సు...." ఏదో చెప్పబోయింది.

ఆలోచిస్తూ కూర్చున్న ఆమె భర్త తానేమి అంటూవున్నదీ తెలియకుండానే, "అవును" అన్నాడు....

"ఇక్కడ వున్నట్టు లేదు." అన్నది ఆమె.

"అవును" అన్నాడు ఆమె భర్త. అని. ఆమె ఏదో అడుగుతున్నదనీ తానేదో ఆమెకు జవాబు చెప్తున్నాననీ తెలుసుకొని, "ఏమిటీ?" అని అడిగాడు....

"అబ్బే ఏమీలేదు. మీ మనస్సు యిక్కడ వున్నట్లులేదు...."అన్నది.

"లేకేం?....ఇక్కడే వుంది." అన్నాడు.

"రాత్రి బాగా నిద్రపట్టినట్టులేదు" అన్నది పరీక్షగా.

అతని మొహం జేవురించింది. పైకి, "పట్టకేం? బాగానే పట్టింది. మామూలుగానే పట్టింది." అని ఏదో పనివున్న వాడికిమల్లే ఇక లేచాడు. ప్రశ్నించడానికి ఆమెకు అవకాశం ఇవ్వలేదు. భోజనం దగ్గర కూర్చొని, మొక్కు తీర్చుకొని బయటకు వెళ్ళాడు.

సుశీల నెమ్మదిగా వంటచేస్తున్న అత్తగారి దగ్గరకు జేరింది.

"రాత్రి నిద్ర పట్టలేదు" అన్నది.

"వేడిచేసి వుంటుంది," అన్నది అత్తగారు.

"వేడిగాదు."

"పడక కుదరలేదేమో!"

"అర్ధరాత్రి అలికిడైంది."

"పాడు, ఎలుకలు" అన్నది అత్తగారు.

"దేవుడిగది దగ్గర," అన్నది సుశీల. ఈసారి అత్తగారు తేరిపార జూచింది.

"మీ అబ్బాయికూడా నిద్ర పట్టలేదు" అన్నది సుశీల.

అత్తగారు మాట్లాడలేదు.

"మీ అబ్బాయి అర్ధరాత్రివేళ దేవుడిగదిలోకి వెళ్ళి వచ్చారా," అన్నది సుశీల.

అత్తగారు నెమ్మదిగా పొయ్యి వైపుకు తిరిగింది. తిరగమోత మాడుతుందని కాదు.

"ఆ గదిలో ఏముంది అత్తయ్యా?" అని అడిగింది సుశీల. తెగించి అడిగింది.

అత్తగారు చెప్పారు—"నామాట విను, నువ్వు ఆ విషయం పట్టించుకోకు...." అని.

"పట్టించుకోకుండా ఎట్లావుండేది అత్తయ్యా?"

"పట్టించుకోకుండా వుండటం నీకూ మంచిది; వాడికీ మంచిది నా మాట వినమ్మా...." అన్నది ఆవిడ.

చేసేదిలేక సుశీల ఈ విషయం మరచిపోదా మనుకుంది. కాని ఆ పని ఆమెవల్ల కాలేదు. ఎవ్వరితోనూ చెప్పకుండా మనసులో ఉంచుకుందాం అనుకుంది. పొరుగింటి సీతమ్మకు మాత్రం ఏ పరిస్థితుల్లోనూ చెప్పరాద దనుకుంది. కాని తీరా సీతమ్మ వొచ్చేటప్పటికి తనకు తెలియకుండానే యీ విషయాన్ని....కదిలించింది.

"వారు మొదటిరోజుల్లో యెప్పుడూ దేవుడి గదిలోనే ఉండేవారా పిన్నీ?" అని అడిగింది సుశీల....

"అవునే"

"ఎందుకో!"

"ఏమోనే! కాని వూళ్ళోవాళ్ళు ఎవ్వరికి తోచిన కారణం వాళ్ళు చెప్పుకుంటూనే ఉండేవాళ్ళు."

"ఏమిటవి పిన్నీ?"

"ఇప్పుడా సంగతులన్నీ యెందుకులేవే?" అన్నది సీతమ్మ ఎట్లాగూ సుశీల ఊరుకోదని తెలిసి—

"తెలుసుకుంటే తప్పేముంది పిన్నీ!"

"తప్పేంలేదు....ఇందులో ఎంతవరకు నిజం వుందో. నేను విన్న సంగతులు చెబుతాను" అని ఆమె చెప్పింది అందులో ముఖ్యమైంది ఒకటే.

"అతని మొదటిభార్య అతనికి రోజూ ప్రత్యక్షం అయ్యేదట. ప్రత్యక్షమై ఏ రోజుకి ఆ రోజు అతను నిర్వర్తించవలసిన విధులను గూర్చి చెప్పేదట ఆమె చెప్పినట్లు అతను చేసేవాడట. ఆమె బ్రతికి వున్నంతకాలం ఆమె చెప్పినట్లు చేసేవాడవటంవల్ల, ఆమె మరణకాలంలో 'ఇక నే నేం చెయ్యను?' అని వాపోతుంటే ఆమె ఈ విధానం ఏర్పాటు చేసి పోయిందట"

"అది నిజమైతే, తర్వాత దేవుడిగదికి వెళ్ళటం ఎందుకు మానివేశారు?" అని అడిగింది సుశీల,

"ఏమోనమ్మా, నాకెట్లా తెలుస్తుంది? అదీ కాకుండా మానివేశాడని నీకెట్లా తెలుసు, నీకు తెలియకుండా వెళ్ళి వస్తున్నాడేమో!" అన్నది.

"వెళ్ళటంలేదు" అన్నది సుశీల.

"నీకంత నమ్మకం వుంటం మంచిదే" అన్నది పొరుగింటి సీతమ్మ.

"ఊళ్ళోవాళ్ళు అనుకునే మాటలు చెప్పానమ్మా. ఆ మాటకొస్తే నీ వివాహం కూడా మొదటి భార్య ఆజ్ఞానుసారమే జరిగిందని చెప్పుకున్నారు ఊళ్ళోవాళ్ళు."

"వారు తిరిగి వివాహం చేసుకుంటే ఆమెకేమివస్తుంది పిన్నీ?"

"మొదటి భార్య మరణించిన నెలరోజులవరకూ అతను ఆ దేవుని గదిలో నుండి బయటకురాలేదు. అతని మనస్సు త్రిప్పకపోతే లాభం లేదని ఒకరోజు ఆమె ప్రత్యక్షమై ద్వితీయ వివాహం చేసుకోమని ఆజ్ఞాపించిందట. ఆమె ఆజ్ఞను తిరస్కరింపలేక విన్ను వివాహం చేసుకున్నాడట."

ఈ విధంగా చెప్పుకుపోతోంది పొరుగింటి సీతమ్మ. సుశీల కళ్ళు చెమ్మగిల్లినై.

"ఏమిటమ్మా? ఏమన్నా జరిగిందా" అని ఆతురతగా అడిగింది సీతమ్మ.

"ఏం లేదు పిన్నీ"

"చెప్పవమ్మా—నీకు తల్లివంటిదాన్ని."

సుశీల ఇక దాచుకోలేకపోయింది. రాత్రి జరిగిన సంగతి పొరుగింటి సీతమ్మకి చెప్పింది, ఆమె ముక్కుమీద వేలువేసుకొని, "అయితే ఇప్పటికీ అతన్ని అతని మొదటి భార్యే నడుపుతూ వుందన్నమాట" అన్నది. "సెగలేకుండా పొగెందుకువుంటుంది. వూళ్లోవాళ్ళు అనుకొనే మాటలు నిజమే—నామాట విని వీలయినంత త్వరలో అసలు ఆగదిలో ఏముందో తేల్చుకో. ఆగది తాళపుచెవి ఎక్కడుందో నీకు తెలుసుగా" అన్నది. ఆమెను ఓదార్చి-సానుభూతి చూపి-బాధపెట్టింది. "ఏదన్నా అవసరం వుంటే కబురు చెయ్యమ్మా వొస్తాను" అని చెప్పి వెళ్ళింది. వెళ్ళి వూళ్ళో ఏమి చెప్పిందో—ఊరు వూరంతా పుకార్లతో ఒక్కసారి గప్పుమన్నది.

అసలు పుకార్లు పుట్టించేవాళ్ళు కాస్తసత్యానికి, ఎక్కువ అసత్యాన్ని కలిపి, బజార్న పెడతారు. ప్రజలు, వారి వారి శక్తికొద్దీ దాన్ని చిలువలు పలువలుచేసి వర్ణించి చెప్పుకుంటారు. ఈ విధంగా నోళ్ళు మారినకొద్దీ రూపం మారుతుంది. చివరికి రూపం పూర్తిగా మారుతుంది. ఈ మారిన రూపంలో అసలు వస్తువును, మొదటిలో దాన్ని సృష్టించినవాళ్లే గుర్తు

పట్టలేక, దాని సృష్టికర్తలు మరొకరనీ, అది సత్యమేననీ అనుకుంటారు. పొరుగింటి సీతమ్మ పని యింతే అయింది. క్రాంతినాధునిమీద ఆ మె కొన్ని పుకార్లు పుట్టించింది. ఆ పుకార్లు ప్రజల నోళ్ళల్లోపడి రూపాలుమారి, మళ్ళీ తనదగ్గరికే వచ్చేసరికి వాటిని గుర్తుపట్టలేకపోయింది. వాటి సృష్టితో తనకే ప్రమేయం లేదనుకుంది. అవి పరమసత్యా లనుకుంటోంది. ఎప్పటి కప్పుడు సుశీలకు జేరవేసింది. రకరకాల పుకార్లను ఈ విధంగావింటూన్న సుశీల వీటినుంచి తప్పించుకోవటానికి దేవుడిగదిలో ఏముందో తెలుసు కోవటం కంటే వేరు మార్గం లేదు అనుకుంది.

"సుశీలను ఆ ఇంటిలో నానాకష్టాలూ పెడుతున్నారట" "క్రాంతి నాధుని మొదటిభార్య చచ్చి దెయ్యం అయ్యిందట"...."పట్టటం పట్టటం భర్తనే పట్టిందట" "క్రాంతినాధుని ఇంటిలో దేవుడిగది వొకటి ఉందట." ఆ దేవుడి గదినిండా దెయ్యాలేనట...."...."క్రాంతినాధుడు అస్తమానం ఆగదిలో తలుపు వేసుకుని ఆ దెయ్యాలతో మాట్లాడుతూవుంటాడట."

ఆ రాత్రి సుశీలకు నిద్రపట్టలేదు. క్రాంతినాధుని నిద్రపోనిచ్చి తాను లేచింది. పక్కగదిలోకి నడిచింది. డ్రాయరులోవున్న తాళపు చెవి తీసింది. దేవుడి గదిదగ్గరకు బయలుదేరింది. మూసిన తలుపులూ, వేసిన తాళం ఆమెను భయపెట్టినై. ప్రాణాలను బిగబట్టి తాళం తీసింది. గదిలోకి అడుగుపెట్టింది. ఆమె వొళ్ళు ఝల్లుమన్నది. క్షణం ఊపిరి సలపలేదు. ఆ గదిలో తానే కాక ఇంకెవ్వరో ఉన్నారనిపించింది. కలయ జూసింది. దేవుడి గదిలో ఒక దేవీ మంటపం, దేవీ మండపంలో ఒక దేవతా విగ్రహం అంతే.

"ఆ విగ్రహం" అనుకున్నది.

"అది వొట్టి బొమ్మే" అని జవాబు చెప్పుకుంది.

"ఆ గూట్లో" అనుకున్నది

"ఆరిపోయిన ప్రమిదె"అని జవాబు చెప్పుకున్నది.

దేవతా విగ్రహానికి పూజ జరుగుతూ ఉన్నట్టుకూడాలేదు. గది అంతా బూజే. విగ్రహానికి ముందు మినుకు మినుకుమనే దీపం.

"అదేమిటి?" అనుకున్నది.

"డ్రాయరు?"

"తాను తాళపు చెవి తెచ్చిన డ్రాయరుకి మల్లేనే ఉంది...." అనుకున్నది.

"అచ్చగా అదే...."

"అందులో ఏముందో"

సుశీలకు చూడాలనిపించింది. డ్రాయరు దగ్గరకు వెళ్ళింది. ఒక అర తెరిచింది. కీచుమని ధ్వనితప్ప ఏమీలేదు. రెండో అర తెరిచింది. అందులో వుత్తరాలకట్టవుంది అకట్ట చేత్తో తీసుకుంది. పాముని తాకినట్లు వొళ్ళు ఝల్లుమన్నది. కట్ట విప్పింది. ఒక వుత్తరం తెరిచింది. అది వొక స్త్రీ వ్రాసింది. తనభర్తకే వ్రాసింది.

"ప్రియా" అంటున్నది.

ఇంతల్లోకే గది గడపలోనుంచి 'సుశీల' అనికేక. ఆమె త్రుళ్ళిపడి తిరిగి చూచింది. గది గడపలో తన భర్త....

"ఆ వుత్తరాలు చూడక సుశీ, చూడకు" అంటున్నాడు ఆ మినుకు మినుకుమనే దీపపు వెలుగులో ఆమె కళ్ళలో అతనికేమి కనిపించిందో. ఆమె మొహం చూడలేకపోయాడు—"చూడకు సుశీ, చూడకు, చూడకు" అంటూనే తలవంచుకున్నాడు. తూలాడు....తలుపు పట్టుకొని ఆపుకోబోయాడు. లాభం లేకపోయింది క్రిందపడ్డాడు. సుశీల భర్తదగ్గరకు వరుగెత్తింది. కొడుకు కేక విన్నదో యేమో 'ఎంతపని చేశావే తల్లీ" అంటూ అత్తగారు వొచ్చింది.

మరునాడు సాయంకాలం క్రాంతినాథుడు నెమ్మదిగా తేరుకుంటున్నాడు డాక్టరు ప్రమాదం లేదని చెప్పాడు. వంట ఇంటిలో అత్తగారూ, సుశీల మాట్లాడుకుంటున్నారు.

"అవును తల్లీ; నాబిడ్డ మొదటి వివాహంకూడా కాకముందు పరిచయం అది. ఆ పిల్లా నాబిడ్డా కలిసి చదువుకున్నారట ..తర్వాత కొన్నాళ్ళ వరకూ ఆపిల్ల యేమయిందో అబ్బాయికి తెలియనే తెలియదు. ఉండి ఉండి మొదటి వివాహం అయిం తర్వాత వుత్తరాలు రావటం మొదలు పెట్టినై. ఆ వుత్తరాల్లో అబ్బాయి తన్ను వివాహం చేసుకుంటానని వ్రాసిన ఉత్తరం తన దగ్గర వుందనీ, అప్పటికి తనకు జన్మించిన శిశువు తండ్రి ఇతనేనని తాను నిరూపించగలననీ, తనకు కావలసిన డబ్బు పంపకపోతే ఇతనిని రచ్చకీడుస్తానని వ్రాస్తూండేది. అబ్బాయి వడి అది అడిగిన డబ్బు పంపుతుండేవాడు....ఆ వుత్తరాల కట్ట ఆపిల్ల వ్రాసిన వుత్తరాల కట్టే."

"దేవుడి గది సంగతి నేను అడిగినప్పుడే మీరీ సంగతి చెప్పి వుంటే, ఇంతదూరం రాకపోయేదిగా అత్తయ్యా" అంది, సుశీల కళ్ళు ఒత్తుకుంటూ....

"ఎట్లా చెప్పేదమ్మా—నీకు తెలిదేమో....ఎట్టాగో ఒక వుత్తరం నా మొదటి కోడలు కంటపడింది....అప్పటినుంచీ అది మంచం పట్టింది. అబ్బాయి ఆ పిల్లకూ తనకూ ఎలాంటి సంబంధం లేదని ఎన్ని చెప్పినా నమ్మలేదు. నమ్మక ఆ దిగులుతోనే మరణించింది. ఈ సంగతి ఎరిగిన నేను నీతో ఏ ధైర్యంతో చెప్పేది తల్లీ."

"అయితే అక్కయ్య యీ దిగులుతోనే మరణించిందన్నమాట."

"అవునమ్మా! ఆ భయంతోనే నీ దగ్గరనూ దాచాం" అన్నది అత్తగారు.

"ఆపిల్ల సంగతి ఇంకేమైనా తెలిసిందా అత్తయ్యా?"

"తెలియకేం, ఆపిల్ల చెడుజీవితానికి అలవాటుపడి, నానాభ్రష్టుఅయి పరువుగా బ్రతికేవాళ్ళని రచ్చకీడుస్తానని భయపెట్టి బ్రతుకుతూ ఉందట— మొదటి కోడలు పోయిన కొన్నాళ్ళవరకూ ఉత్తరాలు రాకపోతే సద్దుమణిగిపోయింది గదా అనుకున్నాను. మళ్ళీ నెలరోజులనుంచీ ఈ వుత్తరాలు

రావటం ప్రారంభం అయినై. అబ్బాయి మొహం చూచే ఉత్తరాలు వస్తున్నదీ లేనిదీ నేను తెలుసుకున్నాను.”

“ఇక ఉత్తరాలు రావులే అత్తయ్యా” అన్నది సుశీల.

“ఏం చెయ్యదలచుకున్నా వేమిటి?” అని అడిగింది అత్తగారు.

“ఇప్పటికి ఆబిడ చాలా ఉత్తరాలు వ్రాసి ఉంటుంది. రేపు నేను ఆబిడ కొక వుత్తరం వ్రాస్తాను” అన్నది సుశీల.

* * *

మరొక సంగతి చెప్పటం మరచిపోయాను. ఆరోజు మొదలుకొని దేవుడిగది తలుపులు ఎప్పుడూ తెరుచుకొనే ఉండేవి. దేవుడిగది మామూలు గదే అయింది.